ప్రజాశక్తి
ఆదివారం 13 జులై 2025
5
పార్వతీపురం మన్యం



సిఆర్‌టిల రెన్యువల్ ఉత్తర్వులు అమలు చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, జిపిఎస్‌ల్లో పని చేస్తున్న సిఆర్టీల రెన్యువల్ ఉత్తర్వులు అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర అధికారులు ఉత్తర్వులు జారీ చేసి నెలరోజులు కావస్తున్నా ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు దాటినా ఇంతవరకు రెన్యువల్ చేయకపోవడం శోచనీయమన్నారు. ఐటిడిఎ అధికారులు వెంటనే ఉత్తర్వుల అమలుకు చర్యలు తీసుకోవాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

విద్యార్థుల ఆరోగ్యం, భద్రత పట్ల రాజీపడొద్దు

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వీరాంజనేయస్వామి

ప్రజాశక్తి - పార్వతీపురం

గురుకులాలు, వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యం, భద్రత పట్ల రాజీపడవద్దని సాంఘిక సంక్షేమం శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి వసతి గృహ వార్డెన్లను ఆదేశించారు. గురుకులాలు, వసతి గృహాల్లోని ఖాళీలన్నీ భర్తీ కావాలని, గ్రామాల్లో తిరిగి విద్యార్థుల ప్రవేశాలు చేయించాలని అన్నారు. తల్లిదండ్రులు లేనివారు, తల్లి, తండ్రి లేని వారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో పార్వతీపురం, విజయనగరం జిల్లాలకు చెందిన అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ వసతి గృహాల మరమ్మతులకు రూ.143 కోట్లు నిధులు ఇచ్చామని, జిల్లాకు రూ.3 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఆ నిధులతో సొంత ఇంటికి తీసుకునే శ్రద్ధను కనబరచి వసతి గృహ మరమ్మతులు చేపట్టాలని వార్డెన్లను ఆదేశించారు. బాలికల వసతి గృహాల్లో లోపల మరుగుదొడ్లను ఏర్పాటు చేసుకోవాలని, మరుగుదొడ్ల లోపల లైట్లు ఉండాలని, అలాగే రక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. హాస్టళ్లను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచాలని, అందుకు అవసరమైన సామాగ్రిని ఉంచుకోవాలన్నారు. ఫినాయిల్, యాసిడ్ వంటివి విద్యార్థులకు అందుబాటులో ఉంచరాదని, విద్యార్థుల వద్ద సెల్ ఫోన్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. అవసరమైన మేరకు మాత్రమే మందులు ఇవ్వాలని, అనారోగ్యంతో ఉండే పిల్లలను ఆసుపత్రికి తీసుకు వెళ్లాలని, అత్యవసరమైతే కార్పొరేట్ ఆసుపత్రిలో ఉచితంగా వైద్యం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. త్వరలో సీసీ కెమెరాలను ప్రతి హాస్టల్‌కు ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. రాష్ట్ర విద్యా, పౌర సరఫరాల శాఖ మంత్రుల సహకారంతో ఫోర్టిఫైడ్ నాణ్యమైన బియ్యాన్ని వసతి గృహ విద్యార్థులకు అందిస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు స్టాకులో ఉండే పాత బియ్యాన్ని వెనక్కితెప్పించి, నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతంలో మలేరియా, అనీమియా, న్యూట్రిషన్ సమస్యలు ఉన్నాయని, కావున దానిపై దృష్టి సారించి మంచి వైద్యం, పోషకాహారం అందించాలని ఆదేశించారు. జిల్లాలో ఉత్తీర్ణత 99 శాతం ఉందని, శత శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అవసరమైతే ట్యూటర్లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన పిదప ఇంటర్‌లో విద్యార్థులు చేరేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వారిని వసతి గృహాల్లోనే ఉంచి అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. వార్డెన్లు ప్రతి రోజు పర్యవేక్షిస్తూ ఉండాలని, గ్రామాల్లోని ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమం కింద చేపడుతున్న పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. సంక్షేమంలో సమస్యలు ఉంటే సచివాలయ సంక్షేమ సహాయకులకు తెలియజేయాలని, గతేడాదిలో అతిసారా, జ్వరాలు వచ్చే ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. నర్సింగ్ చదువుకునే విద్యార్థులకు జర్మన్ భాషను నేర్పించి, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. అనంతరం ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను మంత్రి అభినందిస్తూ, వసతి గృహ విద్యార్థులకు బెడ్‌లను ఎమ్మెల్యే, జేసీ, పీఓతో కలిసి పంపిణీ చేశారు. సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, పార్వతీపురం, విజయనగరం జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారులు ఇ.అప్పన్న, ఎం.అన్నపూర్ణ, ఎస్సీ కార్పొరేషన్ ఇడి ఎం.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, వసతి గృహ సంక్షేమ అధికారులు, తహశీల్దార్ సురేష్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీబాల వీరాంజనేయస్వామి

హాస్టల్‌ను సందర్శించిన మంత్రి

సీతానగరం : స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై అధ్యాపకులు, వార్డెన్లు శ్రద్ధ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, కాలేజీ ప్రిన్సిపల్ ఈశ్వరరావు, బిసిఒఎస్ రూపవతి, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ బొమ్మినేని లక్ష్మణరావు, కంకణపల్లి అరవింద్‌తో పాటు మండలంలోని పలుశాఖ అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఆర్టీలను రెగ్యులర్ చేయాలని మంత్రికి వినతి

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న 729 మంది సిఆర్టీలను రెగ్యులర్ చేయాలని శనివారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీబాల వీరాంజనేయస్వామికి వినతిపత్రం అందజేశారు. 2007లో ఉమ్మడి ఎపిలో 1243 మంది సిఆర్టీలను జీవో 59 ప్రకారం రెగ్యులర్ చేశారని తెలిపారు. గత 18ఏళ్లుగా 729మంది సిఆర్టీలు పని చేస్తున్నారని చెప్పారు. మినిమం టైం స్కేలు నిబంధనలు కూడా గురుకుల సొసైటీ అమలు చేయడం లేదని చెప్పారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రిని కోరారు.



మంత్రికి వినతిని అందజేస్తున్న వికలాంగులు

వికలాంగుల సంక్షేమ జిల్లా అధికారిని నియమించాలి

జిల్లా ఏర్పాటై మూడున్నర దాటినా ఇంతవరకు వికలాంగుల సంక్షేమ, శాఖ జిల్లా అధికారిని నియమించలేదని, దీని వల్ల తమ సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం లేదని వికలాంగుల జిల్లా పరిరక్షణ సేవాసమితి నాయకులు మంత్రి డోల శ్రీబాల వీరాంజనేయస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీకాకుళం జిల్లా అధికారిని ఇక్కడ జిల్లా ఇంఛార్జి అధికారిగా నియమించడం వల్ల తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని చెప్పారు. రెగ్యులర్ అధికారిని నియమించాలని కోరారు.



ఎగువ కాశాయవలస గ్రామస్తులతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి హర్షవర్ధన్

డోలీమోతలపై స్పందించిన లీగల్ సర్వీసెస్ అథారిటీ

ఎగువ కాశాయవలసను సందర్శించిన జూనియర్ సివిల్ జడ్జి
సమస్యలు అడిగి తెలుసుకున్న న్యాయమూర్తి

ప్రజాశక్తి - సాలూరు

మండలం లోని కురుకుట్టి పంచాయతీ ఎగువ కాశాయవలసకు చెందిన ఆశా కార్యకర్త కూనేటి శ్యామల వాంతులు, విరేచనాలతో బాధపడిన నేపథ్యంలో ఆమెను బంధువులు డోలీలో మోసుకొచ్చి ఆసుపత్రికి తరలించిన ఘటనపై ఎపి లీగల్ సర్వీసెస్ అథారిటీ స్పందించింది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న శ్యామలను డోలీమోతలో కొండలు, గుట్టలు దాటుకుంటూ కురుకుట్టి గ్రామానికి తీసుకొచ్చారు. అక్కడ నుంచి ఆటోలో సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. దీంతో ఆమె ఆరోగ్యం కుదుట పడింది. ఈ సంఘటనపై పత్రికల్లో వార్తలు రావడంతో ఎపి లీగల్ సర్వీసెస్ అథారిటీ స్పందించి గిరి శిఖర గ్రామాల్లోని పరిస్థితులపై వాస్తవిక నివేదిక అందించాలని జూనియర్ సివిల్ జడ్జి జి.హర్షవర్ధన్‌ను ఆదేశించారు. ఈ మేరకు ఆయన కరడవలస మీదుగా ఎగువ కాశాయవలస గ్రామానికి చేరుకున్నారు. కరడవలస వరకు వాహనంలో వెళ్లి అక్కడ నుంచి రెండు కిలోమీటర్ల మేర కాలినడకన ఎగువ కాశాయవలస గ్రామానికి చేరారు. గ్రామంలో డోలీమోతలో వెళ్లిన ఆశా కార్యకర్త శ్యామల, గ్రామపెద్దలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల్ని చెప్పాలని కోరారు. ఈ గ్రామంలో 25 ఇళ్లు ఉన్నాయని, 120మంది నివసిస్తున్నారని తెలిపారు. ఎగువ కాశాయవలస నుంచి కరడవలస వరకు రెండు కిలోమీటర్ల మేర, కురుకుట్టి గ్రామానికి మూడు కిలోమీటర్ల మేర ఉపాధి హామీ చట్టం కింద వేసిన మట్టి రోడ్లు ఛిద్రమయ్యాయని, దీంతో వాహనాల రాకపోకలకు సాధ్యం కాదని చెప్పారు. ఈగ్రామంలో ఉన్న 11మంది పిల్లలు రోజూ రెండు కిలోమీటర్ల దూరం నడిచి కరడవలస పాఠశాలకు వెళ్తున్నారన్నారు. అనంతరం కరడవలసలో కంటెయినర్ ఆసుపత్రిని పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు.

నడిమికెల్లలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడిమికెల్లలో శనివారం స్థానిక వైద్యాధికారి సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, మధుమేహ, రక్తపోటు, జ్వర పీడితులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శు భారతమని, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న ఆసుపత్రులను వెంటనే పూర్తిచేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

ప్రజాశక్తి - సాలూరురూరల్

గిరిజన ప్రాంతాల్లో మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలన్న నిర్ణయంతో ప్రభుత్వాలు ఆసుపత్రుల నిర్మాణం చేపట్టాయని, వాటిని మధ్యలో విడిచి పెట్టేశారని వెంటనే వినియోగంలోకి తెచ్చి గిరిజనులకు మెరుగైన వైద్యసేవలందించేలా పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా అన్ని రాజకీయ పార్టీలు గిరిజనులను మోసగిస్తున్నాయని, కనీసం రోగం వస్తే బాగు చేసుకోవడానికి ఆసుపత్రికి తీసుకురావడానికి రహదారి సదుపాయం లేకపోవడంతో చాలామంది గిరిజనులు మార్గమధ్యలోనే మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున ప్రతి గిరిజన గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని కోరారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ ఆంధ్రా-ఒడిస్సా వివాదాస్పద కొటియా సరిహద్దు సమస్యను సమస్యగానే ఉభయ రాష్ట్రాలు చూస్తున్నాయి తప్ప పరిష్కారానికి ఏ ఒక్క రాష్ట్రం చొరవ తీసుకోకపోవడం ఈ ప్రాంత గిరిజనులను తీవ్ర అన్యాయం చేయడమేనని అన్నారు. ఒడిశా అధికారులు ఈ ప్రాంతాలకు వచ్చినా, సమావేశాలు నిర్వహించినా ఇక్కడి గిరిజనులు వారిని తిరస్కరిస్తున్నారని, తామంతా ఆంధ్రాలోనే ఉంటామని కరాకండీగా చెబుతున్నా ఆంధ్రాలోని రాజకీయ నాయకులు, అధికారులు కనీసం వారికి రక్షణగా నిలవకపోవడం దారుణమని విమర్శించారు. గిరిజన ప్రాంతాల్లోని భూములన్నీ సర్వే చేసి అన్ సర్వేడ్ భూములను, మిగులు భూములను ఈ ప్రాంతంలో ఉండే గిరిజనులకు అందేలా ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. నాన్ షెడ్యూల్డ్ గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా గుర్తించాలన్నారు. డోలి మోతలు ఉండకూడదని చెబుతున్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఎక్కడ చూసినా డోలి మోతలతో చాలామంది గిరిజనులు వైద్యం కోసం మైదాన ప్రాంతాలకు పదుల కిలోమీటర్లు నడుచుకుంటూ రావాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. ఈ విషయాలను తెలియజేస్తే ఆమె బుకాయింపుగా ఈ ప్రాంతంలో ఎక్కడా కూడా డోలీమోతలు లేవని, కావాలనే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆమె అనడం ఎంతవరకు సమంజసమని, అలా లేకుండా చేయాల్సిన బాధ్యత గిరిజన బిడ్డగా, మంత్రిగా ఆమెపై ఉందని ఈ విషయాన్ని గుర్తించి ప్రభుత్వం ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేయాలని ఆయన తెలిపారు. అలా చేయకపోతే గిరిజనలందర్నీ కలుపుకొని పోరాటాలకు సిద్ధపడతామని ఆయన తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు సీదరపు అప్పారావు, సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గంగునాయుడు

ఆ'లింకు'లతో రైతులకు తప్పని ఇబ్బందులు

- వెలుగు చూస్తున్న అక్రమ ఎరువులు
- కొరత లేకుండా చూస్తామంటున్న అధికారులు

ప్రజాశక్తి - మక్కువ

ఖరీఫ్ ప్రారంభమైందంటే చాలు అన్నదాతకు అవస్థలు తప్పడం లేదని చెప్పడంలో అతిశయోక్తి కాదు. ఎందుకంటే ఆరంభం నుండే ఎరువులు కోసం అష్టకష్టాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు రైతులకు దాపురిస్తోంది. ప్రభుత్వం మాత్రం ఎవరికీ ఏ విధమైన ఇబ్బంది లేకుండా ఎరువులు సఫర సరఫరా చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం వాటి ఆనవాలు కానరావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న వేలాది ఎకరాల్లో ప్రస్తుత కాలంలో ఒకవైపు వరి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. అలాగే ఉద్యానవన పంటలు, మెట్ట పంటలు వంటి వాటికి కూడా ఇదే తరుణంలో ఎరువులు వేయడం పరిపాటిగా వస్తుంది. ప్రస్తుత మండల స్థాయిలో అధికారులు ఈ పంటలకు సరిపడా ఎరువులను అంచనా వేసి నిల్వ చేసే పరిస్థితి లేకుండా పోయిందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కువ శాతం వరి సాగు పైనే ఎరువులు దృష్టి అంతా పెట్టి, మిగిలిన ఉద్యానవన పంటలకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచేందుకు ఆయా నిల్వల అంచనాల్లో అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదన్న అనుమానాలు కూడా ఒకవైపు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మండలంలోని ఒకంత ఎరువు కొరతకు కారణం వస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా రైతుకు కావాల్సిన ఎరువు కొనుక్కోవాలంటే దొరకని పరిస్థితి. ఒక ఎరువు కావాలంటే రైతుకు అవసరం ఉన్నా లేకపోయినా మరొక ఎరువు తప్పనిసరిగా కొన్నాలన్న లింకును డీలర్లు పెట్టడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవవుతూ కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. మరోవైపు జిల్లా స్థాయి అధికారులు ఆక్రమ ఎరువులపై దాడులు నిర్వహిస్తూనే ఉన్నారు. ఇటీవలే ఎస్ఆర్ పురం పంచాయతీలో నిర్మాణంలో ఉన్న పంచాయతీ కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువులను గుర్తించి అధికారులు సీజ్ చేశారు. రైతు సేవా కేంద్రాల్లో సరైన నిల్వలు లేకపోవడంతో ఎరువులు కోసం రైతులు డీలర్ల వద్ద పడి గాపులు పడాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది. ఇప్పటికైనా అధికారులు రైతులకు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.



ఒకటి రెండు రోజుల్లో పరిష్కారం

రైతులకు ఎరువుల గురించి ఒకటి, రెండు రోజుల్లో ఏ విధమైన ఇబ్బందులు లేకుండా రైతు సేవా కేంద్రాల్లో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచుతామని వ్యవసాయ శాఖ జిల్లా డైరెక్టర్ రాబర్ట్ పాల్ తెలిపారు. ఎస్ఆర్ పురంలో పట్టుబడ్డ లేబుల్ లేని ఎరువులపై సంబంధిత వ్యక్తిపై 6-ఎ కేసు నమోదు చేశామన్నారు. ఎరువుల దుకాణదారుల నుంచి లింకు ఎరువుల విక్రయం కాకుండా చూస్తామని తెలిపారు. అక్రమ ఎరువులపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహిస్తున్నామని, ఎవరి వద్ద అయినా సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని ఆయన తెలిపారు.

ఇల్లే లేదు...
17 విద్యుత్ మీటర్లు ఉన్నాయట!

ప్రజాశక్తి - పాలకొండ

ఆమె నిరుపేది. ఆమెకు ఇల్లే లేదు. అయినా 17 విద్యుత్ మీటర్లు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ ఉదంతం పట్టణంలోని 19వవార్డులో చోటు చేసుకుంది.

పట్టణంలోని 19వ వార్డుకు చెందిన గజలక్ష్మి భర్త సూర్యనారాయణ ఆరున ఎలల క్రితం మరణించారు. భర్తకు వృద్ధాప్య పెన్షన్ అందేది. అయితే భర్త చనిపోయాక ఏ ఆధారం లేకుండా పోయింది. భర్త చనిపోతే ఆ ఫించను భార్యకు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఆమె పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆమె పేరున 17 విద్యుత్ మీటర్లు ఉన్నాయని చెప్పడంతో ఒక్కసారిగా ఆమె అవాక్కయ్యారు. తనకు ఇల్లే లేదని, 17 విద్యుత్ మీటర్లు ఎలా ఆమె ఆవేదన చెందారు, ఈ విషయమై విద్యుత్ శాఖ ఎఇ శ్యామ్‌ను ఆమె కలవగా, 17 మంది వద్దకు వెళ్లి వారి ఆధార్ కార్డులు తీసుకురావాలని సమాధానం చెప్పడంతో ఆమె నిరాశకు గురయ్యారు. లేని మీటర్లు ఉన్నట్లు చూపించిన అధికారులు తప్పిదానికి గజలక్ష్మిని బాధ్యురాలి చేయడం ఎంతవరకు సమంజమని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


వైసిపి సోషల్ మీడియా వింగ్ అధ్యక్షులుగా ఉపేంద్ర కుమార్

పాలకొండ

వైసిపి సోషల్ మీడియా వింగ్ మండల అధ్యక్షులుగా తిర్లంగి ఉపేంద్ర కుమార్‌ను పార్టీ నియమించింది. ఈయన లుంబురు సర్పంచ్‌గా. తనకు ఈ పదవి కట్టబెట్టిన అధినేత జగన్మోహన్ రెడ్డికి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతికి, జిల్లా వైసిపి అధ్యక్షులు పరీక్షిత్ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

సిఎం సహాయ నిధి అందజేత

గుమ్మలక్ష్మీపురం : జియమ్మవలసకు చెందిన రాయల సంతోషి కుమారికి రూ. 30,786, రాయల రామలక్ష్మి కి రూ.30వేలు సిఎం సహాయ నిధి నుంచి చెక్కులను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తన క్యాంప్ కార్యాలయంలో శనివారం అందజేశారు. అలాగే కురుపాంకు చెందిన గౌడు ధనుష్‌కు రూ.66,255 చెక్కును ఆర్థిక సహాయంగా అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ట్స్ స్వచ్ఛంద, సంస్థ డైరెక్టర్ సన్యాసిరావు

ఘనంగా నాబార్డ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని చిన్న పొల్లలో శనివారం నాబార్డ్ 44వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ నాబార్డ్ గ్రామీణ ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి కార్యకలాపాలను ప్రోత్సహించడానికి పెట్టుబడి, ఉత్పత్తి క్రెడిట్‌ను అందించే సంస్థలకు అత్యున్నత ఆర్థిక సంస్థగా పనిచేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కుటీర, చిన్న పరిశ్రమల స్థాపనకు సహాయం అందిస్తుందని చెప్పారు. నాబార్డ్ సహకారంతో ఆర్ట్స్ 1998 నుంచి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రైతు క్లబ్స్ ద్వారా మహిళా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. వాటర్ షెడ్ ద్వారా సహజ వనరుల అభివృద్ధి, మాతోట ద్వారా వెయ్యి ఎకరాల్లో 1030 మంది రైతులతో జీడి, ఉసిరి అంతర్ పంటలు చేసి రైతుల అదనపు ఆదాయం పొందే కార్యక్రమాలు చేపట్టారు. 38 రైతు ఉత్పత్తిదారుల కంపెనీలు ఏర్పాటు చేసి రైతులకు మార్కెటింగ్ వస్తు ఆధారిత శిక్షణ కార్యక్రమాలు, మహిళలకు ఆర్థిక స్వావలంబ దిశగా కృషి చేస్తుందని చెప్పారు. జీవా ప్రోగ్రాం ద్వారా మంచి సహజ వనరులు పుష్కలంగా ఉన్నాయన్నారు. జిల్లాలో ప్రభుత్వంతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలు, రోడ్లు, భవనాల నిర్మాణానికి ఆర్థిక సహాయం చేస్తుందని చెప్పారు.

కార్యక్రమంలో మాతోట వన సహజ ఎఫ్‌పిసి సిఇఒ ఎం.రవి, ఆర్ట్స్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఎవరికి సుపరిపాలన..?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సుపరిపాలన ఎవరికి? సాగునీటి కోసం దశాబ్దాలు తరబడి ఎదురుచూస్తున్న తోటపల్లి, జంఝావతి చివరి ఆయకట్టుదారులకా? సుమారు 20ఏళ్ల కావస్తున్నా నీటి చుక్కకూడా చూడని రామతీర్థ సాగర్ రైతులకా? రెక్కలు ముక్కలు చేసుకుంటూ రెండుపూటలా కష్టబడుతున్నా ఉపాధి కూలీలకా? అనారోగ్య బారిన పడితే డోలిమోత తప్పని గిరిజనులకా? వేట నిషేధ సమయానికి రెండేళ్ల తర్వాత భత్యం ఇచ్చినందుకు మత్స్యకారులకా? ఇంతకీ ఎవరికి...? పోనీ, ఆశా, అంగన్‌వాడీ, ఆయా, మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులు వంటి స్కీమ్ వర్కర్లకు ఏమైనా భద్రత ఉందా? కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై పని భారం తగ్గిందా? రైతులకు ఏమైనా పెట్టుబడులకు తగ్గ సహకారం అందిస్తున్నందుకా? వీరు మాత్రమే కాదు... అనేక తరగతులు, వృత్తిదారుల నుంచి గడిచిన వారం రోజులుగా జిల్లాలో వినిపిస్తున్న పబ్లిక్ టాక్.

సుపరిపాలన పేరిట విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఇంటింటికీ తిరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని కొందరు, ఆదరిస్తున్నారని మరికొందరు, జేజేలు పలుకుతున్నారంటూ ఇంకొందరు తెగేసి ప్రచారం చేసుకుంటున్నారు. అధికార పార్టీ అన్నాక ఆ మాత్రం ఉంటుంది. కానీ, ఆదరణ వెనుక వేదన అర్థం చేసుకోకపోతే పాలకులు పొరపడినట్టే. ఇందుకు కారణాలు, నిదర్శనాలు లేకపోలేదు. ప్రభుత్వం పెంచిన పింఛను సాయం, ఉచిత గ్యాస్‌సిలెండర్లు, తల్లికి వందనం వంటివి కొంతమేరకు జనాన్ని సంతృప్తి పరిచాయని అనుకోవడంలో పొరపాటు లేదు. త్వరలోనే చెల్లిస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం, గత ప్రభుత్వం అమలు చేసిన రైతు భరోసా పథకంతో పోలిస్తే ఉమ్మడి విజయనగరం జిల్లాలో వేలాది మందికి వర్తించలేదని సాక్షాత్తు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనే అధికార యంత్రాంగం అంగీకరించింది. ఇదిగో అదుగో అంటున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వ స్వరం మారింది. ఎన్నికల ముందు రాష్ట్ర వ్యాప్త ప్రయాణం అన్న సర్కారు, తాజాగా జిల్లాకు పరిమితం చేయనున్నట్టు లీకులిస్తోంది. నిరుద్యోగ భృతి అన్నమాటేలేదు. ఇటువంటి తరుణంలో వీరంతా సుపరిపాలన అన్న మాటను ఎలా ఏకీభవిస్తారో ప్రభుత్వమే చెప్పాలి. వాస్తవానికి ఇటువంటి ఉచిత పథకాలకు, రాయితీలకే సుపరిపాలన అనుకుంటే, నీరు, నీడ, గూడు కోసం జనం ఎందుకు అల్లాలాడిపోతున్నారు. పరిపాలన అంత సుభిక్షంగా ఉంటే ఇటీవల చేపట్టిన సమ్మె అంతలా ఎందుకు విజయవంతమౌతుంది. ఇన్ని తరగతులకు వారు ఎందుకు భాగస్వామ్యయ్యారు? దీనికి సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, ముఖ్యంగా ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు నేల విడిచిసాము చేస్తున్నట్టు 'సుపరిపాలన పేరిట ఇంటింటికీ తిరిగినప్పుడు ప్రజలు నిలదీయకపోవడమే గొప్పగా చెప్పుకుంటే ఎలా? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.



అధికారంలోకి రాగానే వ్యవసాయ రంగాన్ని ఉద్ధరిస్తామని టిడిపి కూటమి నాయకులు చెప్పారు. ఇందుకోసం ముఖ్యంగా తోటపల్లి, రామతీర్థసాగర్ పూర్తిచేస్తామన్న మాట నిలబెట్టుకోలేదు. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో రామతీర్థసాగర్‌కు రూ.807.55కోట్లు అవసరం కాగా, కేవలం రూ.68 కోట్లు, తోటపల్లి రూ.519 కోట్లు అవసరం కాగా రూ.47.81 కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. బొబ్బిలి, గజపతినగరం బ్రాంచి కెనాల్ పూర్తిచేస్తామని హామీ ఇచ్చినప్పటికీ నెరవేర్చలేదు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎప్పటి మాదిరిగానే డోలిమోతలు కొనసాగుతున్నాయి. గిరిజన విద్యార్థుల ఆరోగ్య భద్రత కోసం ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకానికి మంత్రి తొలిసంతకం అమలుకు నోచుకోలేదు. బిసి రుణాల్లో రాజకీయాల సిఫార్సులకు పెద్దపీట వేశారు. గిరిజన యూనివర్శిటీ భవన నిర్మాణ పనులు నత్తనడకనే సాగుతున్నాయి. జిల్లాను చుట్టు ముడుతూ అన్ని వైపులా టోల్‌గేట్లు ఏర్పాటు చేసి, వాహనదారులపై భారాలు మోపారు. అంగన్‌వాడీలు, ఆయాలు, ఆశా వర్కర్లు వంటి చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు పెరిగాయి. సహకార రంగంలో ఉన్న భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని అధికారికంగా మూసేశారు. సాలూరులోని జీగిరాం జ్యూట్ మిల్లు, సీతానగరం మండలంలోని ఎన్‌సిఎస్ సుగర్స్, కొత్తవలసలో జిందాల్ పరిశ్రమ, గజపతినగరం మండలంలో ఓలం జీడిపిక్కల ఫ్యాక్టరీ మూతపడ్డాయి. ఫలితంగా వేలాది మంది కార్మికులు జీవనోపాధి కోల్పోయినా ప్రభుత్వం చలించలేదు. మునుపెన్నడూ లేని విధంగా ఉపాధిహామీ అమలులో కూడా జిల్లా వెనుకబడిపోయింది. తగినన్ని పనిదినాలు కల్పించడం లేదు. రూ.వందల కోట్ల బకాయి ఉంది. అంతకు మించి కూలిరేట్లు కూడా గిట్టుబాటు కావడం లేదు. సగటు వేతనం రూ.180 కూడా రావడం లేదు. ఈ విషయంలో మన జిల్లా రాష్ట్రంలోనే వెనుకబడి పోయింది. ఈ నేపథ్యంలో ఇదే సుపరిపాలన అంటూ జనం చర్చించుకుంటున్నారు.

సూపర్ సిక్స్ అమలుకు ప్రభుత్వం కృషి : మంత్రి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్ర ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల అమలుకై ప్రభుత్వం కృషి చేస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శనివారం పార్వతీపురంలో పర్యటించిన మంత్రి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి యిన సందర్భంగా చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం పట్టణంలోని 30 వార్డు, ఒకటో వార్డులో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ఆధ్వర్యంలో జరిగింది. ఈ వార్డుల్లో మంత్రి, ఎమ్మెల్యే తిరిగి ప్రజలను కలిసి వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకుంటూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయాలను అడిగారు. భవిష్యత్తులో చేపట్టబోయే పనులు గురించి ప్రజల నుండి సమాచారం సేకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత ఏడాదిలో పెన్షన్ పెంపు, తల్లికి వందనం, గ్యాస్ సబ్సిడీ, అన్నా క్యాంటీన్, నాణ్యమైన మధ్యాహ్న భోజనం సన్న బియ్యం పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలు అమలు చేసినట్లు వెల్లడించారు. త్వరలోనే మరిన్ని పథకాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. నగరిలోనే ప్రజలు ఆదరణ చేయకపోవడంతో మాజీ మంత్రి రోజా తప్పుడు ప్రచారం చేస్తుందని విమర్శించారు. వైసిపికి 154 నుంచి 11 సీట్లకు పరిమితం చేసినా వారిలో పశ్చాత్తాపం లేదని వచ్చే ఎన్నికల్లో ఒక్క సీటు కూడా పార్టీ గెలవదని జోస్యం చెప్పారు. ఎమ్మెల్యే విజయ్ చంద్ర మాట్లాడుతూ కూటమి పాలన పట్ల ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉండాలని, ప్రజల్లో గందరగోళం సృష్టించడానికి వైసిపి కుట్ర చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న మంత్రి సంధ్యారాణి

సీతానగరం: మండలంలోని నిడగల్లు గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం టిడిపి నాయకులు గాజువు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ఊరేగింపుతో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా వీరాంజనేయులు స్వామి, ఎమ్మెల్యే విజయ్ చంద్ర కి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, మంత్రి ఇంటింటికి తిరుగుతూ ప్రజలను కలిసి వారి కష్టసుఖాలు, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ గత ఏడాది కాలంలో పెన్షన్ పెంపు, తల్లికి వందనం, గ్యాస్ సబ్సిడీ, అన్నా క్యాంటీన్, నాణ్యమైన మధ్యాహ్న భోజనం సన్న బియ్యం పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలు అమలు చేసినట్లు వెల్లడించారు. త్వరలోనే మరిన్ని పథకాలు అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి టిడిపి నాయకులు టి సూర్యనారాయణ. మండల స్థాయి టిడిపి నాయకులు కె అరవింద్. బి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన, సుస్థిర అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వం విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలో పి.లేవిడి లో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఈ ఏడాదిలో అభివృద్ధి సంక్షేమ పథకాలు గురించి ప్రజలతో చర్చించారు. అనంతరం సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, టిడిపి నాయకులు లక్ష్మణరావు, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపుతాం : మంత్రి

సాలూరురూరల్: రాష్ట్రంలో అభివద్ధి కార్యక్రమాలు ఈ ఏడాదిలో ఎప్పుడూ లేని విధంగా జరుగుతున్నాయని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసి ప్రజల మనసులు దోచుకుంటామని రాష్ట్ర గిరిజనశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. మండలంలోని బాగువలసలో శనివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. నియోజకవర్గానికి కోట్ల రూపాయలు విలువచేసే నిధులను తెప్పించి సిసి రోడ్లు, బిటి రోడ్లు, ఆసుపత్రి భవనాలు, గోశాలులు నిర్మించామన్నారు. కొన్ని పంచాయతీల్లో వైసిపి సర్పంచులు అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగకుండా కోర్టులకు వెళ్లి స్టేలు తీసుకొస్తున్నారని, ఇలా అయితే అభివృద్ధి ఎలా అని ఆమె


సీతానగరం: నిడగల్లులో ప్రచారం చేస్తున్న మంత్రి వీరాంజనేయ స్వామి

ప్రశ్నించారు. అనంతరం పెదపదం, శివరాంపురం, మామిడిపల్లి పిఎసిఎస్ చైర్‌పర్సన్లు, డైరెక్టర్లతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వసుధైక కుటుంబం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దూరప్రాంతాల నుంచి పాఠశాలకు వస్తున్న ఆడపిల్లలకు 30 సైకిళ్లను అందజేశారు. పాఠశాలలో చదువుతున్న ఆడపిల్లలు 70 నుంచి 80శాతం మార్కులతో ఉత్తీర్ణులైతే వారికి ప్రతినెలా వెయ్యి రూపాయలు చొప్పున ఆ సంస్థ అందజేస్తుందని తెలిపారు. మరి కొద్ది రోజుల్లో పాఠశాలకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న విద్యార్థిని విద్యార్థులు పాఠశాలకు చేరుకోవడానికి రవాణా ఛార్జీలు కూడా ప్రభుత్వం ఏడాదికి రూ.6వేలు అందజేయడానికి ప్రయత్నిస్తుందని ఆమె తెలిపారు. అలాగే అవకాశమున్న ప్రతి ఒక్కరూ గ్రామాల్లో ఉండే కొన్ని నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకొని వారిని పేదరికం నుంచి బయటపడేలా తోడ్పాటు అందించినట్లయితే వారు కూడా మంచి జీవితాన్ని పొందుతారని, అలా చేయడంవల్ల సమాజంలో గుర్తింపు పొందుతారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డిఇఒ రాజ్‌కుమార్, ఎంఇఒ ఎన్.వెంకట్రావు, మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, వసుధైక కుటుంబం స్వచ్ఛంద సంస్థ సభ్యులు ప్రతాప్, శంకర్ రావు, టిడిపి సీనియర్ నాయకులు మత్స శ్యామ్, బూస తవుడు, యుగంధర్, అన్నపూర్ణ, రమాదేవి, పిఎసిఎస్ చైర్‌పర్సన్లు బొత్స జయప్రకాష్, డొంక వెంకటరమణ, కనకల సూర్యనారాయణ, కసినిబోయిన వెంకటరమణ, త్రినాథ్, వెంకటేష్, లక్ష్మణ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

700 బస్తాల పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పి.కోనవలస చెక్ పోస్ట్ వద్ద విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా వాహన తనిఖీలు చేస్తుండగా, శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం కుమా నుంచి ఒడిశాలోని (నవరంగపూర్)కు 700 బస్తాల పిడిఎస్ బియ్యంతో లారీని పట్టుకున్నారు. సుమారు రూ.15,83,400 విలువ గల 34,800 కిలోల బరువున్న (700 బస్తాలు) బియ్యాన్ని కదుమకు చెందిన రైస్ మిల్ యజమాని గోవిందరావు ఆక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. డ్రైవర్‌ను విచారించగా, తెల్లరేషన్‌కార్డు లబ్ధిదారుల నుంచి సేకరించి ఈ బియ్యాన్ని నవరంగపూర్‌లో అమ్ముతామని తెలిపారు. అనంతరం విజిలెన్స్ అధికారులు 700 బస్తాల పిడిఎస్ బియ్యం, లారీని స్వాధీనం చేసుకుని సివిల్‌సప్లైకి అప్పగించారు. వాహన యజమాని గోవిందరావుపైనా, లారీ డ్రైవర్ మానేపల్లి వెంకటేష్‌పై కేసు నమోదు చేశామని, అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని సిఎస్‌డిటి తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సింహాచలం, సబ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, కానిస్టేబుళ్లు పురుషోత్తమ, తిరుపతిరావు, రెవెన్యూ శాఖ అధికారి హేమలత, పాచిపెంట సిఎస్‌డిటి పాల్గొన్నారు.

కషాయాల స్ప్రేతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - కురుపాం

కషాయాల (స్ప్రే) చేయడం వల్ల పంటలు తెగుళ్ల బారి నుంచి తప్పించుకొని అధిక దిగుబడులు సాధించవచ్చని రైస్ ఫౌండేషన్ అలయన్స్ కో-ఆర్డినేటర్ మాండ్రు మణికుమార్ అన్నారు. మండలంలోని కొండబారిడిలో శనివారం రైతులకు కషాయాలను కావాల్సిన పదార్థాలతో తయారు చేసే విధానం గూర్చి రైతులకు చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న ప్రతి రైతు పంటలకు కషాయాలు వాడాలని, దాని వల్ల పురుగు చేరకుండా మొక్క వేపుగా పెరిగి మంచి దిగుబడి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పద్మిక నరేష్, సిబ్బంది కె.రవి, బి.విద్యాసాగర్, రైతులు పి.దాశరధి, బి.శోభన్ బాబు, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వాలంటీర్లనుద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు ఆనందరావు

జీతాలు పెంపునకు ఐక్య పోరాటం

మాతృబహుభాషా ఉపాధ్యాయ సంఘం

ప్రజాశక్తి - సీతంపేట

సవర భాష విద్యా వాలంటీర్లు జీతాలు పెంపుదలకు మనమంతా ఐక్యతంగా పోరాడాలని మాతృ బహు భాష ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సవర ఆనందరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సవరభాష విద్యావాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెగ్యులర్ ఉపాధ్యాయులకు మాదిరిగా కష్టపడి పనిచేస్తే ప్రభుత్వం కేవలం రూ.5వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటుందని అన్నారు. 23 ఏళ్ల గిరిజన విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చేంత వరకు కృషి చేయాలని చెప్పారు. అదేవిధంగా సవర భాష ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఉపాధ్యాయుల అభివృద్ధికి సభ్యత నిధి సేకరించాలని కోరారు. అదేవిధంగా ఉపాధ్యాయులు విద్యా వాలంటీర్ల విధులు, విధానాలను వివరించారు. సమావేశంలో సంఘం కోశాధికారి ఎల్లంగో, రాష్ట్ర నాయకులు సవర డొంబు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కమిషనర్ గారు.. ఈ నీరు తాగుతారా?

ప్రజాశక్తి - పాలకొండ


కుళాయి ద్వారా వచ్చిన కలుషిత నీరు

స్థానిక నగర పంచాయతీ పరిధిలోని వడమ కాలనీ నక్కలపేట ప్రాంతాల్లో రెండు రోజులుగా కుళాయి మురికి నీరే వస్తుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగర పంచాయతీ అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోక పోవడంతో స్థానికులు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు. నీరు తాగలేక ప్రజలు నానా అవస్థలు గురవుతున్నారు

శ్రీకృష్ణ స్కూల్ పై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పార్వతీపురం

శ్రీకృష్ణ స్కూల్లో ట్యూషన్ పేరుతో సెలవుల్లో కూడా పాఠశాల నడుపుతున్నారని, విద్యార్థుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి.అఖిల్, కార్యదర్శి కె.రాజు డిమాండ్ చేశారు. ఆ స్కూల్ హాస్టల్‌కు ఎటువంటి అనుమతులు లేవని చెప్పారు. శనివారం పాఠశాలను సందర్శించిన ఎస్ఎఫ్ఐ నాయకులు విలేకరులతో మాట్లాడారు. అధికారులు ఇలాంటి పాఠశాలలను సందర్శించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.సింహాచలం, కె. డేవిడ్, పార్వతీపురం టౌన్ అధ్యక్షులు ఎం.సంజీవ్, టౌన్ కమిటీ సభ్యులు సాయి, చందు, ఆది, కూర్మారావు, విద్యార్థులు తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

డాల్ఫిన్‌ల సంరక్షణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -భామిని

భారతీయ డాల్ఫిన్ల సంరక్షణపై ప్రభుత్వం చేపట్టిన డాల్ఫిన్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా శనివారం ఏకలవ్య మోడల్ రెసిడెన్స్ స్కూల్ ప్రిన్సిపల్ జి.గంగాదేవి ఆధ్వర్యంలో ఏకలవ్య విద్యార్థులు డాల్ఫిన్ల సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో డాల్ఫిన్ సంరక్షణపై ప్రతిజ్ఞ, డాల్ఫిన్ సంరక్షణ గురించి తెలిపే వీడియో ద్వారా అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

స్థల వివాదంలో వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని హుస్సేన్‌పురంలో శనివారం జరిగిన స్థల వివాదంలో బొత్స రామారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి .కళాధర్ తెలిపారు. బొత్స రామారావు స్థలంలో వావిలపల్లి సూర్యనారాయణ పశువులపాక వేయటంతో ఆ పాకను తొలగించాలని రామారావు సూర్యనారాయణకు చెప్పినప్పటికీ అతను పట్టించుకోలేదు. దీంతో సూర్యనారాయణ పశువుల పాకలో ఉంటుండగా పెట్రోల్ పోసి నిప్పు అంటించడంతో పాక్షికంగా తల కాలినట్లు సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉత్సవ విగ్రహమా? రక్షిత మంచినీటి పథకమా?

తాగునీటికి పట్టణ ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మేజర్ పంచాయతీ ప్రజలకు తాగునీటి ఇబ్బందుల్లేకుండా ఉండేందుకు గత ఏడాది జలజీవన్ మిషన్ పథకం కింద రూ.54 లక్షల అంచనాతో బిసి కాలనీ వద్ద రక్షిత మంచినీటి పథకంతో పాటు బోరు బావి ఏర్పాటు చేశారు. అయితే పనులు పూర్తయినప్పటికీ వీటి ద్వారా పట్టణ ప్రజలకు చుక్క నీరు అందక ఈ మంచినీటి పథకం ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తుంది. మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో నాలుగు లక్షల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకం ఉన్నప్పటికీ వాటి ద్వారా నీరు ప్రజలకు సరిపడా తాగునీరందక అదనంగా రక్షిత మంచినీటి పథకం పనులు చేపట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరి లోనే గడ్డ కాలనీ, బాబు జగజీవన్‌రావ్ కాలనీ, కస్పా వీధులకు వేసవి ప్రారంభం కాకముందే తాగునీటి సమస్య తలెత్తడంతో గ్రామీణ నీటి సరాపర విభాగం అధికారులు బిసి కాలనీ వద్ద గల రక్షిత మంచినీటి పథకం నుంచి పైన తెలిపిన మూడు వీధులకు తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో జెసిబి ద్వారా తవ్వకాలు జరిపి 1300 మీటర్ల పైపులైను ఏర్పాటు చేశారు. పైప్ లైన్ ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా వాటి ద్వారా నీరు రాక ఆ పైపులు కూడా నిరుపయోగంగా పడి ఉన్నాయి. బిసి కాలనీ వద్ద ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకం ద్వారా ఆ మూడు వీధులకు తాగునీరు సరఫరా చేయరాదని కొంతమంది వ్యక్తులు అడ్డు తగిలినట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మేజర్ పంచాయతీ ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమే గ్రామీణ నీటి సరఫరా విభాగం జెఇ డి.కావ్యను వివరణ కోరగా బీసీ కాలనీలో 1100 మీటర్ల పైపులైను ఏర్పాటు చేయాల్సి ఉందని, ఆ పనులు పూర్తయిన వెంటనే బోరు బావి ద్వారా రక్షిత మంచినీటి పథకానికి తాగునీరు ఎక్కించి సరఫరా చేయాల్సి ఉందన్నారు. ఈ పనులు పూర్తి చేయడానికి కొంతకాలం పడుతుందని ఆమె తెలిపారు.


నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

గెస్ట్ లెక్చరర్ పోస్ట్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న సివిల్ ఇంజినీరింగ్ ఒకేషనల్ కోర్సుకు సంబంధించిన గెస్ట్ లెక్చరర్ పోస్ట్‌కు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ వి.హరగోపాల్ తెలిపారు. ఈ పోస్టుకు బిటెక్ సివిల్ ఇంజినీరింగ్ పాసైన అభ్యర్థులు ఈనెల 14లోగా కళాశాల ప్రిన్సిపాల్‌కు దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఈనెల 15న జిల్లా ఇంటర్మీడియట్ విద్య శాఖ పార్వతీపురంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. మెరిట్ ప్రాతిపదికన నియామకం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వీరఘట్టం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జంతు శాస్త్ర గెస్ట్ అధ్యాపకులుగా నియమించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డిజిఎస్‌వి త్రినాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా అర్హతలు, కుల ధ్రువీకరణ పత్రం, బయోడేటా కళాశాలకు అందజేయాలన్నారు.

సీతానగరం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న షార్ట్ హ్యాండ్ (ఒకేషనల్) జూనియర్ అధ్యాపకులు పోస్ట్‌ను గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన భర్తీ దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్ లచ్చుపతుల దాలినాయుడు తెలిపారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం


రోగులకు తనిఖీలు చేస్తున్న వైద్యాధికారి శంకరరావు

వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని మండలంలోని రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ చీకటి శంకరరావు అన్నారు. శనివారం కురుపాంలో గల గౌడ వీధిలో వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మలేరియా పరీక్షలు నిర్వహించామని, ఎటువంటి మలేరియా పాజిటివ్‌లు రాలేదని, ప్రస్తుతం సీజనల్ వ్యాధులు మాత్రమే ఉన్నాయని, వైరల్ జరాలున్న ప్రాంతంలో ఇంటింటికీ వైద్య సిబ్బందిచే సర్వే నిర్వహిస్తున్నామని తెలలిపారు. పరిసరాలు పరిశుభ్రత, వ్యాధుల బారిన పడకుండా ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లే అవుట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

పట్టణ పేదలకు శాశ్వత నివాసం కోసం నెల్లిపర్తి సమీపంలో ఏర్పాటు చేసిన లేవుట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు. తమ కాలనీకి కనీసం రహదారులు, మంచి నీటి సౌదుపాయం కల్పించలేదని స్థానిక మహిళలు ఎస్.పార్వతి, ఆదిలక్ష్మి, సిహెచ్ చిన్నారి, నాయుడు, జోగులమ్మ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు పడడం వల్ల రహదారి మొత్తం బురదమయంగా మారిపోయి నడవడానికి వీలు లేకుండా పోయిందని, దీంతో రాకపోకలకు చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో సమస్యను ప్రభుత్వానికి, కలెక్టర్‌కు విన్నవించగా, గ్రావెల్ రోడ్లు వేస్తామని మున్సిపల్ అధికారులు రాత పూర్వక సమాధానమిచ్చినా, నేటికీ ఆ హామీ అమలు చేయలేదన్నారు. రోడ్లు వేయకుండా వచ్చిన నిధులు ఎక్కడికి పోయావని, ఆ నిధులు దుర్వినియోగం చేసిన వారిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రోడ్లు, మంచినీళ్ల సదుపాయం కల్పించాలని కోరారు. అలాగే లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలకు సిమెంటు, ఇసుక, ఐరన్ వంటి సామగ్రిని తీసుకురావడానికి చాలా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. అలాగే మంచినీటి సౌకర్యం లేకపోవడంతో బోరు నీళ్ల తాగాల్సి వస్తుందని, దీని వల్ల జలుబు, జ్వరాల బారిన పడుతున్నామని తెలిపారు. పిల్లలు పాఠశాలకు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్న పరిస్థితి ఉందని ఈ పరిస్థితి నుంచి తప్పించి రోడ్లు, మంచినీటి పథకాన్ని మంజూరు చేయాలని కాలనీ వాసులు కోరారు. ఆందోళనలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, కాలనీవాసులు సింహాచలం, జ్ఞాన ప్రకాష్, ఆదినారాయణ, పద్మ,మంగమ్మ పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న నెల్లిపర్తి లేవుట్ వాసులు

నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెంఖల్ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులను త్వరతగతిగా పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు బి.అనిల్, ఆరిక గంగారావు డిమాండ్ చేశారు. శనివారం నిర్మాణం జరుగుతున్న పనులను పరిశీలించి అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు వసతి, తరగతి గది ఒకే దగ్గర ఉండడం, చదువులు చెప్పడం జరుగుతుందని, దీనివల్ల ఇరుకు గదుల్లో చదువులు కొనసాగించాల్సి వస్తుందని తెలిపారు. అంతేగాకుండా పడుకోవాడానికి సరైన బెడ్లు లేక, మరుగుదొడ్లు సక్రమంగా లేక కాలకృత్యాల కోసం బహిర్భూమికి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. గ్రామం మధ్యలో పాఠశాల భవనం ఉండడం వల్ల వాహనాలు రాకపోకలతో శబ్ద కాలుష్యంతో పాఠాలు అర్థం కావడం లేదని, తాగడానికి సరైన మంచి నీటి సౌకర్యం కూడా లేదని విద్యార్థులు ఆవేదన వెలుబుచ్చారని అన్నారు. నిర్మాణంలో ఉన్నటు వంటి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల భవనం పనులు త్వరగా ప్రారంభించాలని కాంట్రాక్ట్ చేసిన తప్పులకు విద్యార్థులను ఎందుకు బలి చేశాయని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. అలాగే పనులు నిలిచిపోవడం వల్ల 200కు పైగా సిమెంట్ బస్తాలు గడ్డకట్టి వృథాగా పడి ఉన్నాయన్నారు. కావున తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణ పనులను పూర్తిచేసి భవనాన్ని విద్యార్థులకు అందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.


గడ్డగట్టిన సిమెంటును చూపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు అనిల్

వంతెన పెండింగ్ పనులు తక్షణమే చేపట్టాలి

ప్రజాశక్తి - కొమరాడ

పూర్ణపాడు- లాబేసు వంతెన పెండింగ్ పనులు విషయంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు తమ వైఖరి వెంటనే ప్రజలకు విషయాన్ని తెలియజేయాలని, పెండింగ్ పనులు తక్షణమే చేపట్టాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి మూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కూనేరు సంతలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సాంబమూర్తి మాట్లాడుతూ మండలంలోని 9 పంచాయతీలు, 42 గ్రామాలకు ఎంతో ఉపయోగకరమైన పూర్ణపాడు- లాబేసు వంతెన పనులు ప్రారంభించి నేటికి 19ఏళ్లు అయినా పని పూర్తి చేయకపోవడం అన్యాయమన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఈ వంతెన పెండింగ్ పనులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చి ఏడాది కావస్తున్నా ఒక్క అడుగు పని జరగని పరిస్థితి ఉందన్నారు. టెండర్లు పిలుస్తున్నాం... డబ్బులు ఉన్నాయని చెప్పడమే తప్ప పనులకు మోక్షం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల రూ.5.50కోట్లు నిధులు మంజూరయ్యాయని పాలకులు, అధికారులు చెప్పడం తప్ప పనులను చేయడంలేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే టెండర్లు ఖరారు చేసి వంతెన పెండింగ్ పనులు ప్రారంభించాలని కోరారు. లేకుంటే స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు నాగేశ్వరరావు, గిరిజన యువత పాల్గొన్నారు.


నిరసనలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ఆ సమస్యలను పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ప్రజా దర్బార్ నిర్వహించారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని, తమ గ్రామాలకు రోడ్లు వేయాలని తదితర సమస్యలను ప్రజా దర్బార్‌లో వినతుల ద్వారా విన్నవించారు. వచ్చిన సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో కురుపాం ఎఎంసి చైర్మన్ కద్రక కళావతి, తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల అధ్యక్షులు అడ్డాకుల నరేష్, కలిసేటి కొండయ్య ఉన్నారు.

సత్య సాయి సేవా సంస్థకు విరాళం

జియ్యమ్మవలసలో గల సత్యసాయి సేవా సంస్థ సభ్యులకు ఎమ్మెల్యే జగదీశ్వరి మందిర నిర్మాణం నిమిత్తం రూ.50,000 విరాళంగా అందించారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల వద్ద గల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈనెల 10న మెగా పేరెంట్స్ టీచర్స్ డే కార్యక్రమానికి నడిమికెళ్లకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి పాఠశాలకు వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంతో ఢీకొట్టి వెళ్లిపోయాడు. విద్యార్థికి కుడి కాలు విరిగిపోవడంతో తోటి విద్యార్థులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో చికిత్స కోసం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఈ రెండు పాఠశాలల రహదారికి పక్కనే ఉండడం వల్ల ఏ విధమైన హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరచుగా విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నారని, వీటిని దృష్టిలో పెట్టుకుని అధికారులు తక్షణమే స్పందించి మరిన్ని ప్రమాదాలకు గురికాకముందే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

14న రిటైర్డ్ ప్రభుత్వ పింఛనుదారుల సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా పరిధిలో గల రిటైర్డ్ ప్రభుత్వ పింఛనుదారులందరికీ ఈనెల 14న ఉదయం 10 గంటలకు స్థానిక పింఛనుదారుల సమావేశ మందిరంలో సమావేశం జరుగుతుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి డి.గణపతిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి హాజరుకావాలన్నారు. అలాగే ఈనెల 15న ప్రభుత్వం నుంచి న్యాయపరంగా రావాల్సిన ఆర్థిక పరమైన అంశాల గురించి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ రెండు కార్యక్రమాలకు రిటైర్డ్ ప్రభుత్వ పింఛనుదారులందరితో పాటు, ఇటీవల రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగులంతా హాజరుకావాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై గిరిజనులకు అవగాహన

ప్రజాశక్తి - పాచిపెంట


వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న నీడ్ డైరెక్టర్ వేణుగోపాలరావు

మండలంలోని నీలంవలస, పనసలపాడు, భీమన్నదొరవలస తదితర గిరిజన గ్రామాల్లో డెంగీ, మలేరియా వంటి వ్యాధులపై వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, వీధులు, కాలువలు పరిశుభ్రంగా ఉంచాలని, అదేవిధంగా ఇంట్లో ఉన్న చెత్తను వీధిలో ఉన్న చెత్తను ఊరు బయట పారవేయాలని గిరిజనులకు నీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు తెలిపారు. వీరితో పాటు నీడ్ బృందం, హెల్త్ ఇన్‌స్పెక్టర్ శంకర్రావు పాల్గొన్నారు.